# కాయ్ రాజా కాయ్

-కొనకలూరి లక్ష్మీనరసింహారావు

'కళ్ళజోడు పెడితే నువ్వు కుమార్ రాజాలా వుంటావు. కళ్ళజోడు తీస్తే నువ్వు రాజాధిరాజులా వుంటావు' మిత్రులు మాటలు విన్నప్పుడు అతడు నిజమే అనుకున్నాడు.

'కొంతమంది ఎదుటవాళ్ళు సాధించిన కార్యఫలాన్ని అనుభవిస్తారు. మరికొంత మంది ఏదైనా సాధించి ఏతత్ ఫలితాన్ని ఎదుటివాళ్ళకు పంచి ఇస్తారు. సో - నువ్వు రెండో కోవకు చెందినవాడివని' జ్యోతిష్కులు అన్నప్పుడు కామోసు అనుకున్నాడు.

"అందం అనేది దేవుడిచ్చిన వరం. అందంగా వుంటావు కాబట్టే నువ్వు దైవాంశ సంభూతుడివి. దీవర్లి సిగతరగా — నీకు వేషం వేసి ఫిల్మ్ మీదకు ఎక్కిస్తే - తెలుగు సిల్వర్ స్క్రీన్ మీద ఎవర్ గ్రీన్ హీరోవి అయిపోతావు...!" అని మరదలు శ్రీలక్ష్మి కొంటెగా అన్నప్పుడు అతడు నిజంగానే హీరో అయిపోయాననుకున్నాడు.

అందరూ "నువ్వు అందంగా వుంటావు!" అన్నారు కాబట్టి ఆ విషయం నమ్మాడు. ఆ విషయం నమ్మాడు కాబట్టే అద్దం ముందు గంటల తరబడి నిలబడ్డాడు. అద్దం ముందు నిలబడ్డది తనే కాబట్టి నిజంగా తను అందంగానే వున్నాననుకున్నాడు. అందంగా వున్నాననుకున్నాడు కాబట్టి రకరకాల ఏంగిల్స్‌లో ఫోటోలు దిగి ఆల్బమ్‌లో పెట్టుకుని ఓ ఫైన్ మార్నింగ్ వున్న వూళ్ళో మాయమయ్యాడు. ఆ మాయమవడం అవడం రెండు రాత్రిళ్ళు, రెండుపగళ్ళు ప్రయాణించి మద్రాసు సెంట్రల్ స్టేషన్‌లో ప్రత్యక్షమయ్యాడు.

అతడి పేరు బైరాగి.

ఎడం చేత్తో ఆల్బమ్, కుడిచేతిలో సూట్‌కేస్ పట్టుకుని రైలు దిగి చుట్టూ చూస్తున్న బైరాగికి మొదట 'అదృష్టం' ఎదురైంది.

అదృష్టం — అదే తనకు తాను ఓ మానవ రూపం దాల్చింది. ఆ ఆకారానికి లుంగీ వుంది. పైన లాల్చీ వుంది. నోట్లో పాన్ వుంది. నుదుటన బొట్టుంది.

ఆ ఆకారం బైరాగిని చూస్తూనే అహా! మరితోపులోకి ఓ కొత్త చిలకొచ్చింది. నీక నొక్కకుండా ముద్దెట్టుకుంటే చేతి నిండా దుడ్డే దుడ్డు...! అనుకుంటూ బైరాగి దగ్గరకు వచ్చి ఇలా అంది — "ఎన్నసారూ! మదరాసుకు కొత్తా...!"

బైరాగి వెర్రివాడిలా చూశాడు.

'ఏమి సారూ! అలా చూస్తురూ! నా పేరుదా ఆర్ముగం అందరు. నేను ఇక్కడి ప్రొడ్యూసర్స్ అందరితో దోస్తి చేస్తిని. నాగేశ్వరరావు, కృష్ణ, చిరంజీవి అంతా మనవాళ్ళే. నువ్వు దా హీరోని అవుతానంటే చెప్పు — టి.నగర్ వెళ్ళిపోదాం!" అన్నాడు.

బైరాగికి ఆర్ముగం శంఖుచక్రాలు ధరించిన విష్ణుమూర్తిలా కనిపించాడు. అడగ్గానే ఏ వరమైనా ఇచ్చే బోళా శంకరుడిలా కనబడ్డాడు. ఆపద మొక్కులవాడిలా కనబడ్డాడు.

ముక్కోటి దేవతలు ఒక్కటిగా కనిపించిన ఆర్ముగంతో బైరాగి మద్రాసులో వున్న అన్ని ప్రదేశాలు తిరిగాడు. ఇద్దరు పెద్ద హోటల్స్‌లో కూచొని ఐస్‌క్రీంలు తిన్నారు.

బైరాగి చేతిలో వున్న ఆల్బమ్ తిరగేసి ఆర్ముగం 'ఆహా ఏం ఫేసూ, ఏం ఫేసూ - ఏడాది తిరిగాక ఈ ఫేసును పిక్చర్లలో బుక్ చేసుకోడానికి ప్రొడ్యూసర్స్ లచ్చలు లచ్చలు కుమ్మరిస్తారు!' అన్నాడు. ఇంకా చాలా చాలా అని ఓ రాత్రి బైరాగి వున్న హోటల్లో - బైరాగి ఒంటి మీద వున్న లుంగీ, బనీను తప్ప మిగిలినవన్నీ తీసుకుని పలాయనం చిత్తగించాడు. వెళ్తూ వెళ్తూ బైరాగి తల కింద ఓ చీటి పెట్టాడు. అందులో ఇలా వుంది "జీవితంలో ఏదన్నా సాధించాలనుకున్నప్పుడు మొదట నువ్వు చేయాల్సింది ఎదుటవాళ్ళని నమ్మకపోవడం."

తెల్లవారాక బైరాగి లుంగీ మీదే హోటల్ రిసెప్షన్‌కి వెళ్ళి తెలుగులో



ఏదో చెప్పాడు. రిసెప్షన్ క్లర్క్ తమిళంలో ఏదో సమాధానం చెప్పింది. ఇద్దరికీ ఏమీ అర్థంకాక చిట్టచివరకు ఇంగ్లీష్‌లో ఏదేదో అనుకొని పోలీసు రిపోర్ట్ ఇచ్చారు.

ఇన్‌స్పెక్టర్ వచ్చి లుంగీ, బనీను మీద వున్న బైరాగి అవతారం చూసి ముందు నవ్వాడు. ఆ తర్వాత నవ్వుకుంటూనే రిపోర్ట్ రాసుకున్నాడు. రాసుకుంటూనే నవ్వాడు. నవ్వుతూనే అడిగాడు "తిరుక్షవరం అయింది కదా! అసలు తమరు ఎందుకొచ్చారిక్కడికి?"

"సినిమాలో హీరోనవుదామని."

బైరాగి మాటలు వినగానే ఆయన అన్ని భాషల్లోనూ నవ్వి "పోయిన సొమ్ము మీకు దొరకదు. ఎందుకు చెప్పు గోల? తిరుగు టపాలో వెళ్తానంటే నా పంటు, షర్ట్ ఒకటి ఫ్రీగా ఇస్తాను. టిక్కెట్ కూడా కొనిస్తా. వెళ్ళిపో" అన్నాడు.


ఆర్ముగంతో మాట్లాడి మాట్లాడి అప్పటికే తమిళం వాసన బైరాగికి అంటింది. "నేనుదా... వచ్చినా హీరోనవకుండా పోను..." అని పెద్దగా అరిచాడు.

అప్పటికి పది రోజుల నించి కొడుకు కోసం ఆ చుట్టుపక్కల వెదుకుతున్న బైరాగి తల్లిదండ్రులకు మద్రాసులో బైరాగి అరుస్తున్న అరుపులన్నీ వినిపించేలా ఉత్తరం రాశాడు ఆ ఇన్‌స్పెక్టర్.

ఆ ఉత్తరం చూడగానే బైరాగి తండ్రి ముందు తన నెత్తీనోరు కొట్టుకున్నాడు. అటువంటి కొడుకుకు తల్లి అయినందుకు భార్య నెత్తీనోరు కొట్టాడు. అనక ఇద్దరూ నెత్తీనోరు కొట్టుకుంటూ మద్రాసులో దిగారు.

ఇంటికి రా రమ్మని బైరాగి గడ్డం పట్టుకున్నారు. చేతులు పట్టుకున్నారు. జుట్టు పట్టుకున్నారు. ఏది పట్టుకున్నా బైరాగి రానని భీష్మించుక్కూచుండడంతో ఏం చేయాలో పాలుబోక ఓ లక్ష రూపాయిలు ఫిక్స్‌డ్ డిపాజిట్ వేసి బైరాగికి ప్రతి నెలా వడ్డీ వచ్చేలా ఏర్పాటుచేసి రైలెక్కారు.

గ్లాసెడు నీళ్ళలో పెరిగిన చేప పిల్ల హఠాత్తుగా సముద్రంలో పడ్డప్పుడు ఎలా ఉక్కిరిబిక్కిరి అవుతుందో అలా ఉక్కిరిబిక్కిరయిపోయేడు బైరాగి. అలా ఉక్కిరిబిక్కిరయిపోతూ ఊరంట తిరుగుతుండగా




ఏమీ తోచక గోళ్ళు కొరుక్కోవడం అలవాటయింది. ఆ గోళ్ళు కొరుక్కోవడం ఏదో ఆ ఫిల్మ్ ఇన్‌స్టిట్యూట్‌లోనే కొరుక్కోవచ్చు అనుకుంటూ అందులో చేరి డిప్లొమా తీసుకుని బయటపడ్డాడు.

అతడికిప్పుడు మద్రాసు కొట్టిన పిండి.

'ఎ' క్లాస్ ప్రొడ్యూసర్స్ దగ్గర్నుంచి 'జడ్' క్లాస్ ప్రొడ్యూసర్స్ వరకు అందరికీ తన ఆల్బమ్, డిప్లొమా సర్టిఫికెట్ చూపించి వేషం ఇవ్వమని అడిగాడు. అర్థించాడు. ప్రార్థించాడు. ఇంకా చాలా చాలా చేశాడు.

రెండేళ్ళు గడిచాక మద్రాసు ప్రొడ్యూసర్స్, డైరెక్టర్స్ తన ప్రతిభను అర్థం చేసుకునేంత ఉన్నత స్థాయికి ఇంకా ఎదగలేదు అనుకుంటూ ఉన్న వూర్లోకొచ్చి పడ్డాడు.

'హ హో...హో' ఫిల్మ్ ఇన్‌స్టిట్యూట్‌లో నేర్చిన ఏక్షన్ బిట్స్ ఫ్రెండ్స్ దగ్గర చేసి చూపించాడు ఊర్లో దిగగానే. వాళ్ళంతా బైరాగి ఖర్చు మీద అప్సర హోటల్లో పెసరట్టు తిన్నారు. కూల్ డ్రింక్‌లు తాగారు. తాగి నీ ఏక్షన్ బ్రహ్మాండం! మద్రాసు ప్రొడ్యూసర్స్ మెదళ్ళే ఛండాలం. లేకుంటే నీలాంటి గొప్ప ఏక్టర్‌ని పోగొట్టుకుంటారా?" అని ముక్తకంఠంతో అనడంతో, తనలో ఏమాత్రం లోటు లేదుకాక లేదు అని నిశ్చయించుకున్నాడు.

ఇప్పుడు బైరాగి మనసులో వున్నదొక్కటే.

ఏదో ఒకటి సాధించాలి.

తన టాలెంట్‌ని నిరూపించుకోవాలి.

ఎలా...? ఎలా...? ఎలా... అని బుర్ర బద్దలుకొట్టుకుంటుండగా అతనికో అయిడియా తట్టింది.

ఆ అయిడియా టి.వి. సీరియల్ ఒకటి తనే తీయడం. అందులో తనే హీరో అయిపోవడం.

ఆ అయిడియా తట్టినందుకు తన బుర్రని తనే అభినందించుకున్నాడు. వున్న వూళ్ళో మాయమయి హైదరాబాద్ టి.వి. స్టేషన్ ముందు తేలాడు.

అక్కడ సినిమాల్లో ఛాన్సులు రాని చాలామంది హీరోలున్నారు. రైటర్లున్నారు. దర్శకులున్నారు. వాళ్ళందర్నీ చూస్తూ "అహో... నాలాంటివాళ్ళు ఇక్కడ చాలా మంది వున్నారన్న మాట" అనుకున్నాడు. అక్కడున్నవాళ్ళలో నిర్మాతలు తెలుగు బుల్లి తెరకు పాతం కమ్మిందని - దానికి శస్త్ర చికిత్స చేయుడానికే తామంతా ఉద్భవించామని - బుల్లి తెర స్థాయి పాతాళంలో వుందని, అలాంటి దాన్ని జాతీయ స్థాయికి తీసుకుపోవడమే తమ లక్ష్యమని అనుకుంటున్నారు.

"వాడి పిండాకూడు. వాడున్నాడు చూశావు...! పాడుం కాయ మొఖం. నవ్వితే ఏడ్చినట్టుంటుంది. ఏడిస్తే నవ్వినట్టుంటుంది. వాడు హీరోనట. తెలుగు టి.వి. ప్రేక్షకులకు వాడు ఏడు తరాల శాపం! నాకో ఛాన్సిస్తే చాలు 1989 నుంచి 1999 వరకు ఈ హీరోగాళ్ళంతా జీరోలయిపోతారు" అని హీరోలవుదామని వచ్చినవాళ్ళనుకుంటున్నారు.

అసలు కంప్లీట్ క్లోజప్ - మిడ్ క్లోజప్ - జూంబాక్, జూం ఫ్రంట్ అంటే తెలియని ఏబ్రాసిగాళ్ళంతా దర్శకులైపోతే మంచి ప్రోగ్రామ్స్ ఎక్కడొస్తాయి చెప్పండి? నాకు

ఒక్కటంటే ఒక్కటే — ఒక్క ఛాన్సిస్తే దర్శకత్వం చేసి నేనేంటో తెలుగు టి.వి. ప్రేక్షకులకు మాపిస్తాను' అని దర్శకులు కావాలనుకుంటున్నవాళ్ళు అంటున్నారు.

వీళ్ళందరి మాటలు వింటూ బైరాగి మెల్లిగా దూరదర్శన్ డైరెక్టర్‌ని కలిశాడు. తానొచ్చిన పైనం చెప్పాడు. చెప్పాక ఆయన సమాధానం కోసం మాశాడు. ఆయన ముందుగా అడిగాడు "మీ దగ్గర కథ వుందా...?"

"లేదు...!"

"అలాగా! ముందు మీరు ఓ మంచి కథని ఫస్ట్ ఎపిసోడ్ డైలాగ్స్‌తో సహా రాయించండి. మిగిలిన పన్నెండు ఎపిసోడ్స్ సినాప్సిస్ ఇస్తే చాలు. బాగుంటే అప్రూవల్ ఇస్తాం. ఆ తర్వాత మీరు షూట్ చేసుకోవచ్చు."

బైరాగిని 'ఇక మీరు వెళ్ళొచ్చు' అనే అర్థం వచ్చేలా ఆయన కుర్చీలో కదిలాడు. చిన్నగా నగ్గాడు. దస్తీతో ముఖం తుడ్చుకున్నాడు. అయినా బైరాగి అక్కడ్నించి కదల్లేదు.


రెండు నిమిషాలు ఆగి బైరాగే అన్నాడు "కథ, మాటలు ఏకదంతం చేత రాయిస్తాను. ఏమంటారు?"

ఏకదంతం అప్పటికి ఓ పది పిక్చర్స్‌కి డైలాగ్స్, పది నవలలు పత్రికలకు రాసి వున్నాడు. ఎన్ని నవల్లు రాసుంటే అంత గొప్పవాడు. ఎన్ని పిక్చర్లకు పనిచేసుంటే అంత గొప్ప రచయిత కదా అన్న భావం స్ఫురించేలా అన్నాడు.

బైరాగి మాటలు విని ఆయన నవ్వి "అదేం లేదు! మాకు కథ ముఖ్యం. క్వాలిటీ ముఖ్యం. అది బాగుంటే అనామకుడైనా మాకు ఫర్లేదు. మేము రచయిత ఎంత గొప్పవాడు అని కాదయ్యా! ఆ రచయిత రచన ఎంత గొప్పగా వున్నదా అని మాస్తాం. మీరు వీలైతే అలాంటి గొప్ప రచయితను ట్రేస్ చేయండి!" అంటూ ఆయనే లేచి నిలబడి షేక్ హాండిచ్చాడు.

బైరాగి లేవక తప్పింది కాదు. అక్కడ్నించి బయటపడి గొప్ప రచయిత ఎవరు - ఎవరి రచన్లు గొప్పగా వుంటాయి? క్వాంటిటీ కాదు - క్వాలిటీ అది ఓ చిన్న సైజు పరిశోధన చేసి ఓ రచయితను పట్టాడు. అతని పేరు చిదంబరం.

చిదంబరం ఎడ్రస్ అతి కష్టం మీద సంపాదించి అతడింటికి వెళ్ళాడు.




అక్కడ బైరాగి ఊహించినట్టు ఎ.సి. రూమ్స్, రివాల్వింగ్ చైర్స్ ఇవేమీ లేవు. కుప్పబోసిన పుస్తకాల మధ్య పురుగులాంటి ఓ మానవాకారం బైరాగిని మాసి "నేనే చిదంబరాన్ని" అని సమాధానం ఇచ్చింది. అంతే!


ఆ రూంలో ఎక్కువసేపు కూచోలేక బైరాగి అన్నాడు "మీరొకసారి బయటికి ఎక్కడికైనా వస్తే మాట్లాడదాం...!"

"ఏం మాట్లాడాలి? ఫరవాలేదు చెప్పండి...!"

"ఈ గదిలో నాకు మాట్లాడదామన్నా మాటలు పెగిలేలా లేవు" అందామనుకుని ఆగిపోయాడు. "ప్రస్తుతం నేను హోటల్లో వున్నాను. అక్కడికెళితే కొంచెం సౌకర్యంగా వుంటుందని."

చిదంబరం ఏమనుకున్నాడో ఏమో - బైరాగి వెంట నడిచాడు. పది నిమిషాల తర్వాత ఇద్దరూ హోటల్లో వున్నారు. టీలు అయ్యాక బైరాగి అడిగాడు "నాకు మంచి కథ కావాలి. టి.వి. సీరియల్ తీయాలనుకుంటున్నాను. మీరు కథ...?"

"మీకు ఎలాంటి కథ కావాలి...?"



"నేషనల్ స్టాండర్డ్. తెలుగు టి.వి. ప్రిస్టేజ్ నేషనల్ లెవల్‌కి పెంచే కథ కావాలి!"

"ఇప్పుడే చెప్పమంటారా?"

"మీ ఇష్టం!"

చిదంబరం కథ చెప్పడం మొదలుపెట్టాడు.

కథ చెప్పడం అయిపోయాక బైరాగి చిదంబరాన్ని ఎత్తుకొని ఆకాశంలో గిరగిరా తిప్పినంత పనిచేశాడు. "అద్భుతం సార్... అద్భుతం! మీరు వెంటనే రాసేయండి. స్క్రిప్టు రేపు ఇస్తారా!"

"రేపా!" ఆశ్చర్యంగా అన్నాడు చిదంబరం. "కూరగాయలు జోకినంత తేలిక కాదు స్క్రిప్టు అంటే సీన్ కంటిన్యుయేషన్, డైలాగ్ కంటిన్యుయేషన్‌తో మిక్స్ అయి స్టోరీ రావాలి. కనీసం నాకు నెల రోజుల వ్యవధి కావాలి రాయడానికి!"

"నెల రోజులా!" ఈసారి ఆశ్చర్యపోవడం బైరాగి వంతైంది. "అదేంటి సార్! ముప్పై పేజీలు రాయడానికి ముప్పై రోజులా...!"

"మాటలు రాయడం మాటలు కాదు! మీరు చెప్పినట్టు ఓవర్ నైట్ రాసేవాడెవడన్నావుంటే రాయించుకోండి!"

బైరాగి వ్యవహారం తెగేదాకా వచ్చింది అనుకుంటూ నవ్వాడు. "సరే! మీరన్నట్టు నెల రోజుల తర్వాతే ఇవ్వండి! మరి రెమ్యూనరేషన్ ఎంతో చెప్తే..."

"పది వేలు!"

"అలాగే ఇస్తాను. కానీ మీ కథ టి.వి. స్టేషన్ నుంచి అప్రూవల్ వచ్చాక ఇస్తాను."

"మీ ఇష్టం! ఓ వెయ్యి రూపాయిలు అడ్వాన్స్ ఇవ్వండి."

"సారీ... నేను స్క్రిప్టు మీద ఒక్క పైసా కూడా ఖర్చు పెట్టదల్చుకోలేదు. అప్రూవల్ అయ్యాక మీ రడిగినంత ఇస్తాను. మీకేం సార్! ఏదో రాసి మా ముఖాన పారేస్తారు. ఆ తర్వాత మేమెన్ని తిప్పలుపడాలో మీకు తెల్సు. అప్రూవల్ రాలేదనుకోండి నేను మీ కిచ్చిన వెయ్యి రూపాయిలు బూడిదలో పోసినట్టే కదా!"

హఠాత్తుగా అక్కడ చీమకాళ్ళు విరిగినా వినవచ్చేంతటి నిశ్శబ్దం ఆవరించింది.

"మీరు టి.వి. స్టేషన్ చుట్టూ ఎన్నిసార్లు తిరిగుంటారు?"

ఆ ప్రశ్న చిదంబరం ఎందుక అడిగాడో బైరాగికి అర్థం కాలేదు. అయినా చెప్పాడు. "ఓ వంద సార్లు!"

"అంటే మీరు వంద సార్లు తిరగడానికి ఏవరేజ్‌గా రెండు వేలు ఖర్చు చేశారు. రేపు నా కథ అప్రూవల్ అవడానికి కూడా ఖర్చు పెడ్తారు. అంటే మీరు ఎన్ని రకాల ఖర్చులు ఏ రంకంగానైనా పెడతారు కానీ కథకు మాత్రం ఖర్చుపెట్టరు ఔనా?"

ఔనన్నట్లు తలూపాడు బైరాగి.

వెంటనే చిదంబరం లేచి నిలబడ్డాడు. "సారీ! మీరు నాతో వ్యాపారం చేస్తున్నారు. అయితే పెట్టుబడి పెట్టకుండా లాభం మాత్రమే నాది అవాలనుకునే వ్యాపారం చేస్తున్నారు. నా కది ఇష్టం లేదు. గుడ్ బై!" అంటూ బయటికి నడిచాడు.

మరో పది నెల్లు గడిచాక—

బైరాగి కథ అంటూ చిదంబరం చెప్పిన కథనే వేరే వాళ్ళచేత మాటలు రాయించి, అప్రూవల్ అయ్యాక సీరియల్ తీసి స్పాన్సరర్‌ని పట్టి బ్రాడ్ కాస్ట్ చేయించాడు. ఆ సీరియల్‌లో బైరాగే హీరో.

రెండు ఎపిసోడ్స్ అయ్యాక—

స్పాన్సర్ చేసిన స్పాన్సరర్‌కి, కథ నాది అని ప్రొడ్యూస్ చేసిన బైరాగికి లాయర్ నోటీసులు అందాయి. చిదంబరం ఆ సీరియల్ మీద స్టే తీసుకొచ్చాడు. ఆ కథ తనదే అంటూ.

ఆ రోజు - కథ చెప్పేటప్పుడు చిదంబరం చొక్కా లోపల వున్న పాకెట్ టేప్‌ని ఆన్ చేసి చెప్పాడన్న విషయం బైరాగికి తెలీదు. అంతే కాదు చిదంబరానికి కన్నడ భాష కూడా వచ్చు. ఆ కథ బైరాగికి చెప్పడానికి ముందే ఏడాది క్రితం అది కన్నడంలో డబ్ అయింది.

## పడగ గది



వీధి వీధంతా ఊరేగింపు రెక్కలతో
వినువీధికి ఎగురుతూ వుంటే
జయకారాల ఘోషల నురగల మీద
జనం పడవలు పారాడుతూ వుంటే
ఒక్కడు కూచున్నాడు పడగ గదిలో
శ్వాసల్లో బుసలు ముడుచుకుని

ఒక్కడు ముడుచుకు కూచుంటే
ఊరేగింపు రెక్కవాలదు.
అసహనం దహించి వేస్తుంది ఆ బుర్రని
అక్కడ ఒక్క మొక్క మొలవదు.
బాగుంటుంది ఆ జీవి బయటపడతే
వీధిని కళ్ళల్లో తొడుక్కుని

కక్కుకున్న నాటుసారా ఇంకిన
చొక్కా మరక కాదు వీధంటే
ఎవడి శ్వాసనో పీల్చి పారేసే
ఎంగిలి పీక కాదు వీధంటే
పలుకుతుంది వీధి పచ్చి నిజంలా
ఉరుమును గొంతులో తురుముకుని

గదికీ వీధికీ మధ్య జరిగే
ఘర్షణ కానే కాదది
అసహనం నెత్తికెక్కిపోయిన
అసూయ అవ'శేష'మిది
విరిగిపోతే మంచిది ఆ పడగ విషం
విశ్వాన్ని ఒంటికెక్కించుకుని

— డాక్టర్ సి. నారాయణరెడ్డి

# త్రాంతో చేతి వెన్నముద్ద